క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఇబ్రహీంపట్నం: దండుమైలారం 33 కేవీ ఫీడర్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వైర్లకు తగులుతున్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు దండుమైలారం, ముకునూర్, నెర్రపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

గట్టుఇప్పలపల్లి గ్రామస్తుల పాదయాత్ర

మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

తలకొండపల్లి: గట్టు ఇప్పలిపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ గ్రామస్తులు, స్థానిక నాయకులు సోమవారం గట్టుఇప్పలపల్లి నుంచి తలకొండపల్లి మండల కేంద్రం వరకు పాదయాత్ర చేపట్టారు. ఈ మేరకు తహసీల్దార్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రేణురెడ్డి, యాదయ్య, చంద్రయ్య, సాయిరాం, మచ్చేందర్, పర్వత్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ స్వప్న

తలకొండపల్లి: గ్రామంలో అంతర్గత రహదారులు, మురుగు కాల్వలు, వాటర్ ట్యాంక్‌ల వంటి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు సర్పంచ్ స్వప్న అన్నారు. మండల పరిధిలోని చెన్నారంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను సోమవారం సర్పంచ్ ప్రారంభించారు. గ్రామ పంచాయతీ నిధులతో డ్రైనేజీ పనులను చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వరలక్ష్మీ, వార్డు సభ్యులు జ్యోతి, మల్యానాయక్, సునీత, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమేష్‌నాయక్, హెచ్‌ఎం కొండల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఉమాదేవి, భాస్కర్‌రెడ్డి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న జయశ్రీ, నర్సిరెడ్డి దంపతులు

యాచారం: మండల పరిధిలోని గునుగల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం గ్రామానికి చెందిన తోటిరెడ్డి జయశ్రీ, నర్సిరెడ్డి దంపతులు రూ. 20వేల విలువచేసే నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. వారి తల్లితండ్రులు పర్వత్‌రెడ్డి, పద్మమ్మ జ్ఞాపకార్థం ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న పెన్షనర్లు

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ ఉద్యోగ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని సోమవారం ఇబ్రహీంపట్నం తహసీల్దార్ రామ్మోహన్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈసందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంక్షేమ సంఘం ఇబ్రహీంపట్నం యూనిట్ అధ్యక్షుడు అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. జీవన వ్యయం పెరిగినందున కనీసం పెన్షన్ నెలకు రూ.30వేలు ఇవ్వాలని, 2023 జూలై నుంచి పీఆర్సీని అమలు పరచాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులను క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నేతలు ప్రతాప్‌శర్మ, బాలకిష్టయ్య పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

అబ్దుల్లాపూర్ మెట్: బాటసింగారం రైతుసేవా సహకార సంఘం సభ్యురాలు యశోద మే 14న మృతి చెందింది. సోమవారం సహకార సంఘం చైర్మన్ విఠల్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులకు రూ.25 వేల ఆర్థికసహాయాన్ని అందజేశారు. సంఘం డైరెక్టర్ యాదిరెడ్డి, మేనేజర్ ఐలేష్‌యాదవ్ పాల్గొన్నారు.

నిఘానేత్రంపై నిర్లక్ష్యమేల?

- కడ్తాల్‌లో పనిచేయని మెజార్టీ సీసీ కెమెరాలు
- నేరాల సమయంలో నిందితులు తప్పించుకునే అవకాశం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు



కడ్తాల్ ప్రధాన కూడలిలో పనిచేయని సీసీ కెమెరా

కడ్తాల్: మండల కేంద్రం, పరిధిలోని గ్రామాల్లో దాతలు, ప్రజల సహకారంతో పోలీసులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ఎక్కడా సక్రమంగా పని చేయడం లేదు. చోరీలు జరిగినా.. ఇంకా ఎదైనా సంఘటనలు జరిగినా నేరస్తులను గుర్తుపట్టడంలో సీసీ కెమెరాల ప్రాధాన్యత అంతాఇంతా కాదు. మండల కేంద్రంలో 2018 నుంచి 2021 సంవత్సరం వరకు స్థానిక వ్యాపారస్తులు, ప్రజాప్రతినిధులు, దాతల సహకారంతో పోలీస్ అధికారులు ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు చేశారు. వర్షాలతో పాటు తరుచూ రోడ్డు మరమ్మతులు చేపట్టడం, గోతులు తీయడంతో.. సీసీ కెమెరాల కనెక్షన్‌లు తరుచూ తెగిపోవడం, పర్యవేక్షణ కొరవడటం తదితర సమస్యలతో ప్రస్తుతం చాలాచోట్ల సీసీ కెమెరాలు పనిచేయడం లేదు.

కడ్తాల్ మండలంలో..

ఇప్పటివరకు కడ్తాల్ మండలంలో 300 వరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా అందులో కేవలం 135 కెమెరాలు మాత్రమే పనిచేస్తున్నాయి. నేను సైతం కెమెరాలు 360 వరకు ఉండగా అందులో మెజార్టీ కెమెరాలు పనిచేయడం లేదు. కడ్తాల్ టౌన్‌లో కమ్యూనిటీ కెమెరాలు మొత్తం 80 వరకు ఏర్పాటు చేయగా అందులో 20–25 వరకు మాత్రమే పనిచేస్తున్నట్లు సమాచారం. జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు సందర్భంగా పలుచోట్ల సీసీ కెమెరాల వైరింగ్ తెగిపోవడం, ఈదురు గాలులు, వర్షాలకు పలు సీసీ కెమెరాలు పని చేయడం లేదు.

నిరంతర నిఘాకు..

నిరంతర గస్తీ సాధ్యపడని చోట్ల, ముఖ్యమైన కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటు చేస్తారు పోలీసులు. కడ్తాల్ మండల కేంద్రం మీదుగా శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారి ఉండటంతో రహదారి మీదుగా వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి. అయితే ప్రమాదాల సమయంలో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో నిందితులు తప్పించుకునే ప్రయత్నం చేయవచ్చు. సీసీ కెమెరాలు సరిగా పనిచేస్తే ప్రమాదం జరిగిన సమయంలో ఫుటేజీ ద్వారా బండి నంబర్‌తో పాటు ప్రమాదానికి గల కారణం, తప్పు ఎవరి వైపు ఉంది అనేది స్పష్టంగా చూడవచ్చు.

అభివృద్ధిలో పరుగు..

కడ్తాల్ మండల కేంద్రంగా అవతరించడంతో అభివృద్ధిలో వేగంగా పరుగులు పెడుతుంది. మండల కేంద్రంలో తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ, వ్యవసాయశాఖ కార్యాలయాలతో పాటు, వందల సంఖ్యలో వ్యాపార సముదాయలు వెలిశాయి. ఇప్పటికే మండల కేంద్రంలో ఏపీజీవీబీ, యూనియన్ బ్యాంకు, ఎస్‌బీఐ, సిండికేట్ బ్యాంకులతో పాటు, పాలశీతలీకరణ కేంద్రం, బంగారం దుకాణాలు, 7 ఏటీఎం సెంటర్లు, సినిమా హాలు, మూడు పెట్రోలు బంకులు, రెండు ఇంటర్ కళాశాలలు, రెండు డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వీటన్నింటికి ఎప్పటికప్పుడు పోలీసులు రక్షణగా ఉండాలంటే కుదరని పరిస్థితి. ఆయా సెంటర్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే నిరంతర నిఘా ఉంటుంది. మండల వ్యాప్తంగా సీసీ కెమెరాలను బాగు చేయడంతో పాటు అవసరమైన చోట నూతన సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



తలకొండపల్లి కూడలిలో అలంకార ప్రాయంగా..

మరమ్మతులు చేయిస్తాం



మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో మెజార్టీ చోట్ల సీసీ కెమెరాలు పనిచేయడం లేదనే విషయం మా దృష్టికి వచ్చింది. ఇటీవలే వ్యాపారస్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలతో సమావేశం ఏర్పాటు చేశాం. పాత వాటికి మరమ్మతులు చేయించడంతో పాటు అవసరమైన చోట కొత్తగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం.

– హరిశంకర్‌గౌడ్, ఎస్‌ఐ, కడ్తాల్

హామీలను విస్మరించిన బీఆర్‌ఎస్ సర్కార్

రైతు సంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి

యాచారం: మోసపూరిత హామీలతో సీఎం కేసీఆర్ మూడోసారి అధికారంలోకి రావడానికి చూస్తున్నారని రైతు సంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి అన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు, రేషన్ కార్డులు, పింఛన్లు, దళితబంధు పథకం కింద నగదు, గొర్రెల పంపిణీ తదితర పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తు సోమవారం యాచారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతుసంఘం నేతలతో కలిసి ఆయన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దళితులకు 3 ఎకరాల భూమి పంపిణీ చేస్తానని, అర్హులైన పేదలకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, ఇంటి స్థలాలు పంపిణీ చేస్తానని గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన కేసీఆర్ వాటిని విస్మరించారన్నారు. నంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజయ్య, బాషయ్య, పుష్ప, చందునాయక్, జంగయ్య, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న మధుసూదన్‌రెడ్డి, నాయకులు

వ్యాధుల పట్ల అవగాహన అవసరం

జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్లు

మంచాల: నిరుపేదలకు ఆరోగ్య సేవలు అందించడం గొప్ప భాగ్యమని జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మంచాల మండల పరిధిలోని లింగంపల్లి గ్రామంలో స్వస్థవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరంలో 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. క్యాన్సర్ కేర్ సెంటర్‌కు ఉచితంగా ఒక అంబులెన్స్ వాహనం అందించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. క్యాన్సర్‌పై అవగాహనా లోపంతో చాలామంది భయాందోళనకు గురవుతున్నారన్నారు. ముందుగా గుర్తిస్తే ఏ వ్యాధినైనా సులభంగా నయం చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో స్వస్థవ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ చతుర్వేది, అమెరికాలో ప్రముఖ గ్యాస్ట్రో వైద్య నిపుణులు డాక్టర్ అనిరెడ్డి దివేష్ రెడ్డి, గైనకాలజిస్టు సరిత, డిప్యూటీ జిల్లా వైద్యాధికారి ధరణి, మంచాల ప్రభుత్వ వైద్యశాల వైద్యుడు శ్రావణ్‌కుమార్, డాక్టర్లు.. మాన్విత, నవీన్, సర్పంచ్ వినోద, ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి శిరీష, వార్డుసభ్యులు పాల్గొన్నారు.



అంబులెన్స్ అందజేసిన స్వస్థవ ఫౌండేషన్ సభ్యులు

ప్రభుత్వ బడుల్లో సౌకర్యాలు కల్పిస్తాం



విద్యార్థులకు నోటుబుక్స్ అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు

మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: నిరుపేదలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని రాందాస్‌పల్లి మాజీ సర్పంచ్ ఏనుగు శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని రాందాస్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలకు సోమవారం లక్ష రూపాయలు విలువచేసే 1200 నోటుబుక్స్, ఏడు గ్రీన్‌బోర్డులు, స్టాండ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ బడులకు తమవంతు సహాయం అందజేస్తామని తెలిపారు. విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. పేదరికాన్ని చదువు ద్వారానే రూపుమాపవచ్చన్నారు. పాఠశాలలో ఆయా లేకపోవడం వలన విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకొని జూలై మొదటి వారం నుంచి ఏడాది పాటు తన సొంత డబ్బులతో తాత్కాలికంగా ఆయాను నియమించి జీతం చెల్లిస్తానని హామీ ఇచ్చారు. పాఠశాల అభివృద్ధి విద్యార్థుల బాగు కోసం కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, సరస్వతి, శ్రీనివాస్, విజయకాంత్, కాంగ్రెస్ పార్టీ యూత్ లీడర్ రాజు, భిక్షపతి, జంగయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో వసతులు కల్పించాలి

ఏబీవీపీ ఆధ్వర్యంలో పాఠశాలల బంద్

తలకొండపల్లి: ఏబీవీపీ తెలంగాణ రాష్ట్రశాఖ పిలుపు మేరకు ఏబీవీపీ నగర కార్యదర్శి రాజు ఆధ్వర్యంలో మండల కేంద్రంతో పాటు, గట్టుఇప్పలపల్లి, చంద్రధన తదితర గ్రామాల్లో ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలలను సోమవారం బంద్ చేయించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. మన ఊరు–మన బడి కింద మంజూరైన పాఠశాలల నిధులను వెంటనే మంజూర్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో.. విద్యార్థులకు త్వరగా బుక్స్, యూనిఫామ్‌లను అందజేయాలని, ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని, డిమాండ్ చేశారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షుడు భరత్, నాగరాజు, గిరి, శివ, భరత్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారు..

ఆమనగల్లు: ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన పాఠశాలల బంద్ ఆమనగల్లు పట్టణంలో సోమవారం విజయవంతమైంది. స్థానిక పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను ఏబీవీపీ ఆధ్వర్యంలో మూసివేయించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తుందని ఏబీవీపీ నేతలు ఆరోపించారు. సరైన వసతులు లేక ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర నాయకులు భరత్, మల్లేశ్, స్థానిక నాయకులు నరేశ్‌గౌడ్, సాయి, తరుణ్‌నాయక్, అంజి, శివ, మల్లేశ్, సుమన్‌నాయక్, శివాచారి, బద్రు, సునీల్, శివ, శంకర్, రాకేశ్ పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం: పాఠశాల బంద్ చేయిస్తున్న ఏబీవీపీ నేతలు

ఫీజులను నియంత్రించాలి..

యాచారం: పాఠశాలలో నెలకొన్న సమస్యలు, ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల వసూళ్లను నిరసిస్తూ సోమవారం ఏబీవీపీ నాయకులు యాచారం మండలంలో నిరసన తెలిపారు. యాచారం, చింతపట్ల, నక్కర్తమేడిపల్లి, నందివనపర్తి, గునగల్, నల్లవెల్లి తదితర గ్రామాల్లోని పాఠశాలలను బంద్ చేయించారు. ఏబీవీపీ నాయకులుబీరప్ప,మహేష్, సాయి, వీరేష్, గణేష్, సిద్ధు పాల్గొన్నారు.

సామాన్యులను దోపిడీ చేస్తున్నారు..

ఇబ్రహీంపట్నం: ఏబీవీపీ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం ఇబ్రహీంపటంలో పాఠశాలల బంద్ విజయవంతం అయింది. ఏబీవీపీ గ్రేటర్ హైదరాబాద్ జాయింట్ సెక్రటరీ వంగ సంజీవరెడ్డి మాట్లాడుతూ.. విద్యారంగాన్ని వ్యాపార ధోరణితో చూసే ప్రైవేట్ విద్యాసంస్థలు సామాన్యులను దోపిడీకి గురిచేస్తున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, టీచర్ల కొరత తదితర సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సాయిధన్‌రాజ్, శివకృష్ణ, జగదీశ్, సందీప్, మహేందర్, పవన్, శ్రీకాంత్, వంశీ, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వసతులు కల్పించాలి..

కడ్తాల్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన పాఠశాలల బంద్ కార్యక్రమం మండల కేంద్రంలో విజయవంతమైంది. మండల కేంద్రంలోని ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలను ఏబీవీపీ నాయకులు బంద్ చేయించారు. సదుపాయాలు కల్పించాలన్నారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీకాంత్, నాయకులు శ్రీకాంత్, సందీప్, శ్రీకాంత్, కరుణాకర్, భరత్ తదితరులు ఉన్నారు.

బీసీ ఆర్థికసాయం ఇంటింటి సర్వే

యాచారం: బీసీ ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇంటింటి సర్వేను సోమవారం ఎంపీడీఓ విజయలక్ష్మి పర్యవేక్షించారు. యాచారం, తక్కళ్లపల్లి, మాల్, చౌదర్‌పల్లి తదితర గ్రామాల్లో బీసీ ఆర్థిక సహాయం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి కుటుంబ ఆర్థిక పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న వారు అర్హులా కాదా అని ఆరా తీశారు.

రాంపూర్‌లో హరితహారం



మొక్కలు నాటుతున్న ఉపాధి కూలీలు

తలకొండపల్లి: నాటిన ప్రతి మొక్కను బతికించుకోవాలని సర్పంచ్ శ్యాంసుందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని రాంపూర్ శివారులో హరితహారంలో భాగంగా సోమవారం ఉపాధిహామీ కూలీలతో కలిసి సర్పంచ్ మొక్కలు నాటారు. ఉపసర్పంచ్ మోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింహ, కూలీలు, మహిళలు పాల్గొన్నారు.

వరుణ దేవుడా.. కరుణించు

- పట్నంలో చల్లబడ్డ వాతావరణం
- ఐదారు రోజులుగా చినుకులే తప్ప కురవని భారీ వర్షం
- భారీ వర్షాలకై రైతన్న ఎదురుచూపు

ఇబ్రహీంపట్నం: గత ఐదు రోజులుగా వర్షాలు ఊరిస్తున్నాయి.. ఆకాశం నిండా కారు మబ్బులు.. కాని వర్షం జాడ కనిపించడంలేదు. కారు మబ్బులు కమ్ముకోవడం, జోరుగా ఈదురుగాలులు వీచడంతో ఎంతటి భారీ వర్షం కురుస్తుందోనని ప్రజలు భావిస్తే అందుకు భిన్నంగా వర్షం కురవడంలేదు. సాధారణంగా జూన్ మొదటి వారంలో వర్షాలు ప్రారంభం అవుతాయి. కాని ఈసారి మూడు వారాలు దాటినా వాన జాడలేక ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. నైరుతి రుతు పవనాలు ప్రవేశించడంతో గత ఐదారురోజులుగా వాతావరణంలో మార్పు చోటుచేసుకుంది. వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ చెబుతుంది. అయితే ఇందుకు అనుగుణంగా ఆకాశంలో మబ్బులు కమ్ముకుంటుడంతో ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలోని రైతులకు ఆశలు చిగురించాయి. అయితే వానవస్తున్నట్లే కనిపిస్తున్నప్పటికీ రావడం లేదు. దీంతో సేద్యం ముందుకు సాగడంలేదు. దుక్కిదున్ని సాగుకు సమాయాత్తం చేసేందుకు రైతులు సిద్ధంగా వున్నా వానదేవుడు కనుకరిస్త లేడని రైతులంటున్నారు. ఇబ్రహీంపట్నం మండలంలో 22వ తేదీ నుంచి సరాసరి కురిసిన వర్షపాత వివరాలు.. 22న 3.9 ఎంఎం, 23న 6.3 ఎంఎం, 24న 20 ఎంఎం, 25న 10 ఎంఎం వర్షపాతం నమోదైంది. ప్రతికూల వాతావరణ పరిస్థితులు నెలకొని ఉండటంతో భారీ వర్షం కోసం అన్నదాతలు ఎదురుచూస్తున్నారు. ఒకటి రెండు భారీ వర్షాలు కురిస్తే సాగు వేగం పుంజుకుంటుందని అధికారులు అంటున్నారు.

విత్తనాలు ఇప్పుడే వేయొద్దు



భూమి పదనుకు సరిపడా వర్షం ఇప్పటి వరకు కురవలేదు. కావున దుక్కిదున్నేందుకు ఇంకా కొంత సమయం పడుతుంది. 20 ఎం.ఎంకు మించి వర్షం పడలేదు. అడపాతడపా పడిన జల్లులకు నేలపైనే పదనుగా కనిపిస్తుంది. డివిజన్ పరిధిలో పలువురు రైతులు పత్తి విత్తనాలు వేసి ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షం కురిసిన తర్వాతే విత్తనాలు వేసుకోవాలి.

– సత్యనారాయణ, వ్యవసాయ సహాయ సంచాలకుడు, ఇబ్రహీంపట్నం

కబ్జా కోరల్లో పెద్ద చెరువు



పెద్ద చెరువులో డంప్ చేసిన రాళ్లు

- మట్టి, రాళ్లతో పూడ్చివేస్తున్న ఆక్రమణదారులు
- వరదకాలువకు అడ్డంగా నిర్మాణాలు
- కేసులు పెట్టినా ఆగని అక్రమాలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

హయత్‌నగర్: కుంట్లూర్ పెద్ద చెరువుకు పెద్ద కష్టం వచ్చింది. ఓ వైపు ఆక్రమణదారులు చెరువును మట్టి, రాళ్లతో పూడ్చివేస్తుండగా మరోవైపు వరద కాలువకు అడ్డంగా నిర్మాణాలు చేపడుతూ చెరువు ఉనికినే ప్రశ్నార్థకం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. అబ్దుల్లాపూర్‌మెట్టు మండలం కుంట్లూర్ పెద్ద చెరువు సుమారు 95 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో కొంత అసైన్‌మెంట్ భూమి ఉంది. దీన్ని అదునుగా చేసుకుని ఆక్రమణదారులు ఇష్టానుసారంగా మట్టి, రాళ్లతో నింపుతున్నారు. కొంతకాలంగా చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో డంపింగ్ జరుగుతున్నా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కాలువ ప్రవాహానికి అడ్డుగా..

మరో వైపు హయత్‌నగర్ మదర్‌డెయిరీ పక్కనుంచి ఈ చెరువులోకి పెద్ద ఎత్తును వరద నీరు వచ్చే కాలువ ఉంది. ఈ కాలువ ప్రవాహానికి అడ్డుగా ఇటీవల నిర్మాణాలు వెలిశాయి. ఈ నిర్మాణాల కారణంగా చెరువులోకి వచ్చే వరదనీటికి ఆటంకం ఏర్పడే అవకాశం ఉంది. వరద కాలువ సరిగ్గా లేకపోవడంతో అడ్డంగా నిర్మాణాలు వెలుస్తున్నాయి. కాలువను గుర్తించి మార్కింగ్ చేయాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తండటంతో వరద నీరు ఎటువైపు వెళ్తుందో అని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కేసులు నమోదు చేసినా...

పెద్ద చెరువును రాళ్లతో పూడ్చుతున్నారని స్థానిక మత్స్యకారుల ఫిర్యాదు మేరకు ఆక్రమణ దారులపై ఇరిగేషన్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు వారిపై కేసులు నమోదు చేశారు. మూడు నెలల క్రితం వారిపై కేసులు పెట్టినా చెరువు పూడ్చివేత ఆగడంలేదు. కేసులు కాగితాలకే పరిమితం అయ్యాయని.. దీతో ఆక్రణదారులు మళ్లీ కబ్జాలకు పాల్పడుతున్నఆరని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు.

ఇరిగేషన్ అధికారుల వైఫల్యమే



ఇరిగేషన్ అధికారుల ఉదాసీనత కారణంగా చెరువు ఆక్రమణకు గురవుతుంది. అధికారులు చూసి వెళ్తున్నారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. రాత్రిపూట రాళ్లు, మట్టిని డంపింగ్ చేస్తున్నారని చెప్పినా పట్టించుకోవడం లేదు.

– గీత, స్థానిక కౌన్సిలర్

చర్యలు తీసుకుంటాం

చెరువులో డంపింగ్ చేస్తున్న వారిపై ఇప్పటికే కేసులు నమోదు చేశాం. అయినా డంపింగ్ చేస్తున్నారని తెలిసింది. వారిపై మరింత కఠినమైన కేసులను పెట్టాలని చూస్తున్నాం. రెండు రోజుల్లో ఆక్రమణదారులపై మరిన్ని కేసులు పెడతాం.

– గంగ, ఇరిగేషన్ ఏఈ, అబ్దుల్లాపూర్‌మెట్టు

ఇందిరమ్మకాలనీలో కంటి వెలుగు శిబిరం

తుర్కయంజాల్: కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ ఐలయ్య అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని కమ్మగూడ ఇందిరమ్మకాలనీలో ఆయన కంటి వెలుగు శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ సాబెర్‌అలీతో కలిసి ఐలయ్య ప్రారంభించారు. ఉచిత కంటి పరీక్షలతో పాటు, మాత్రలు, కళ్లజోడు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య, మున్సిపల్ సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే రైతులకు న్యాయం

మండల అధ్యక్షుడు రమేష్

మంచాల: సీఎం కేసీఆర్ వెంటే రాష్ట్ర రైతులు ఉన్నారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చీరాల రమేష్, మంచాల ఎంపీపీ నర్మద అన్నారు. సోమవారం మంచాల మండల కేంద్రంలో వారు మాట్లాడారు. మంచాల మండలంలో ఈ ఏడాది 17,467 మంది రైతులకు రూ.17,79,515 రైతుబంధు సాయం జమకావడం జరిగిందన్నారు. ఇంకా రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకోని రైతులు ఈనెల 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పుల్లారెడ్డి, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బహదూర్, మాజీ ఎంపీసీ వైస్ చైర్మన్ రవి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జానీపాష, రైతు సంఘం జిల్లా సభ్యుడు జంగారెడ్డి, నాయకులు కిషన్‌రెడ్డి, రఘుపతి, సత్యనారాయణ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.